# గురకానందం మార్పు

పాపం! అసలతనిపేరు ఆనందరావే. ఆ పేరు మాత్రం చులాగ్గా వచ్చిందీ!

పుట్టినప్పుడు తల్లి అన్నది—"మా అమ్మపేరు అచ్చమ్మ: నాన్న పేరు రామయ్య. కలిపేస్తే...."

" ఓ చిన్న 'యునైటెడ్ స్టేట్స్' అవుతుంది" అని అన్నాడు తండ్రి.

"అంటే" అన్నది తల్లి .

"ఏం లేదులే."

"కలిపేస్తే అచ్యుతరామయ్య పేరు చక్కగా కుదురుతుంది" అని ఆవిడ చెపితే తండ్రి శంకరశాస్త్రిలుకు నచ్చలా.

"మనింటిపేరు ఆచంటవారు. ఆద్యక్షర అకారం ఇంటిపేరులో దీర్ఘించినట్లే పేరులోకూడా అకారదీర్ఘం ఉంటేనేగాని జాతకం యోగించదు. తెల్లవాళ్ళదేశంలోగూడా జాతకాన్ననుసరించే పేర్లు పెడుతున్నారిప్పుడు. ఇదుగో! ఆనందరావందాం. ఆపైన మనచేతుల్లో లేదేమీనీ!"

అయితే ఆనందం ఆనందం అనీ చిన్నప్పటినుంచీ పిలవబడ్డాడు మనవాడు. అనగా బి. ఏ. కు పట్నంవెళ్ళేదాకా ఆనందంగానే ఉంది వాడి పని. హాస్టల్లో చేరింతర్వాత జాతకం యోగించటానికింకా మొదలేయలేదు గాని దీర్ఘించింది. గురకానందం అయినాడు. అతని గదిలో రెండోవాడు జేరటానికి వెరపు. హాస్టలు మేనేజరు ఎంతమందిని బెదిరిస్తాడూ? ఒక్కడికి ఒకగది ప్రత్యేకం ఇచ్చేశాడు. ఇది చూసిమాత్రం కుర్రాళ్ళంతా గురకటం నేర్చుకో ప్రయత్నించారుగాని, ఓరోజల్లా చిన్న యాదవయుద్ధం లాటిది జరిగి అంతా మానుకున్నారు. మానుకున్న తర్వాత ఆనందాన్ని వెక్కిరించడం

ఎక్కువైంది. తత్సందర్భంలో ఒకరోజు ఒక అరవకుర్రాడు "ఎన్నడా గురకారావ్" అని వెక్కిరిస్తే, ఛా, అరవ వెక్కిరింపేమిటని, ఆంధ్రులంతా కలిసి ఆనందాన్ని గురకానందం చేశారు. పేరు నిలిచింది!

హాస్టలుకుర్రాళ్ళ బాధ అదోరకం. ఏదో నెట్టుకుపోతారు. సహధర్మచారిణిది దుస్సహం!

శోభనంరోజునే ఆనందం భార్యకు గుండెల్లో రాయిపడ్డది. రాత్రి నడిజామువేళకు గదిలో కలిగిన ధ్వని విని-ఆ పిల్ల పేరు సుశీల— మేలుకొని, వాళ్ళింట్లో రెండు పిల్లులున్నై. పిల్లులు పోట్లాడుతున్నాయేమో, భర్త మేలుకుంటాడని లేచి విసినకర్రతో గోడమీద మెల్లిగా కొడుతూ ఇస్సు ఇస్సు మన్నది. ఆగకుండా వచ్చే ఆ ధ్వనికి తాళలేక లేచి గదిచుట్టూ తిరిగిందిగాని ఏమీలేదు. తిరిగి మంచం ఎక్కబోయే సమయానికి భర్త వద్దనుంచే వస్తున్నదని గ్రహించింది. ఆ! ఓవేళ పిల్లులు పెంచే వాడైతేమాత్రం పెళ్ళికి చంకనెట్టుకెడతాడేమోగాని శోభనం గదిలోనికి తెస్తాడా అనుకొని, పరకాయించి చూస్తే, నోరుతేలేసి ఆనందం తీసేగుర్రక, వినపడడంగాదు, కనబడింది!

మర్నాడు గదిలోకిపోదే ఆ పిల్ల! కన్నీళ్ళు పెడుతుంది. బలవంతాన గదిలోకి నెట్టితే మాత్రం తలుపునే కరుచుకుని కూర్చున్నది. బలవంతాన్నో బతిమాలో ఆనందమా పిల్లను ఊరడించి సరసంజేశాడు. జోడించి ముసుగేద్దామని వాడు యత్నంజేస్తే కేకేసి తలుపుదగ్గరకు పరుగెత్తింది ఆ పిల్ల. మూడోరోజుమాత్రం కులాసాగా ఎందుకు జరుగుతుంది!

కాపరానికి బ్రహ్మయత్నంమీద వెళ్ళిన సుశీల స్వప్రయత్నం చేత భర్తకు గురకను పోగొడదామనుకున్నది. చనువెక్కువైంతర్వాత ఓరోజు ఆనందంతో అన్నది—"కాలేజీ కుర్రాళ్ళు మిమ్మల్ని వెక్కిరించే వాళ్ళట గాదూ!"

"నేమాత్రం వాళ్ళని వెక్కిరించేవాడ్ని గాదూ!"

"ఇదా, బాగానే ఉంది! ఐతేవిన్నారా? లలితమ్మ చదువుకున్న మనిషా-భర్త పొడుంపీలుస్తాడని వదిలేసింది. అయినానూ, గురక మానేయరాదూ?"

"బాగుందే! భగవంతుడిచ్చిన గురక మనుష్యుడెలా మానేయడం? శివుడర్ధనారీశ్వరుడుగదా, గురక పెడతాడనుకో, పార్వతి పారిపోతుందా?"

"పోదురూ!తన సగం తాను తీసుకుపోతుంది.శివుడికి పూర్ణమౌతుంది!"

"చాల్లే భయంలేకుండా ఏమిటా మాటలు?"

పొరుగింటి శేషమ్మ కబుర్లకని వస్తే సుశీల సోది సుశీలది. కొన్నాళ్ళనుంచీ కబుర్లేమీ లేవు. గురకకు మందేమిటీ అనితప్ప!

"మొన్న వాళ్ళ కుర్రాడు సిగరెట్లు మానేయటానికి అమెరికా అట, అక్కడ్నుంచి మందు తెప్పించుకున్నాడట. గురకకుకూడా అక్కడ మందుండదూ?"

"భగవంతుడిచ్చిన గురకను మనిషి మాన్పేయగలడా అనే ఆయనతో ఏంచెప్పి ఏం లాభమమ్మా?"

"భగవంతు డివ్వడమేమిటమ్మా! ఓ బొల్లంటే, కుష్ఠంటే భగవంతుడిస్తాడేమోగాని గురకను భగవంతుడివ్వట మేమిటి!"

"అంతకన్నా ఇంకా యేం భాగ్యమిస్తాడు ఆ భగవంతుడు?"

"పెళ్ళిలో మొదట్రోజు తెలియలేదుటమ్మా?"

"ఆ భజంత్రీ బాజాలల్లో కలిసినదాన్ని కనుక్కోవడమెలా!"

"అదేమిటమ్మా, నిద్రపోయేటప్పుడు సన్నాయి ఉండదుగాదూ?"

"పదిమందిలో గురకను కనిపెట్టడం, పరదాలవెనక రంకును కనిపెట్టడం, తిరణాల్లో తురకను కనిపెట్టడం ఎవరికి చేతవును? మగపెళ్ళివాళ్ళకంతమాత్రం తెలివితేటలుండవూ!"

"అబ్బ! ఏమోనమ్మా! గురకపెట్టే మొగుడుతో వేగడం కష్టమే! ఓ పని చెప్తా చేస్తావా? ఆయన నిద్రపోతుంటే కిటికీ బయట గాడిదను కట్టించు. సన్న కర్ర ఒకటి దగ్గరుంచుకుని, ఆయన గురకపెట్టే వేళకు గాడిద చెవిలో కర్రపెట్టు. అది అరవటం చూసైనా సిగ్గుపడి మానేస్తాడేమో!"

"ఏం ఉపాయం! ఆ కర్ర తీసుకుని నన్నే కొడతారు."

"అయితే ఏం జేస్తావు?"

"ఏవుంది ఉరిదీసుకోవాలి!"

దుర్భరమైంది సుశీలకు మొగుడుతో కాపురం చేయటం. మొగుడు దెబ్బలు కొడతాడని లేచిపోయిన వాళ్ళున్నారు. ఎవరిమీదైనా మనసుపడి లేచిపోయినవాళ్ళున్నారు. మొగుడు గురక పెడతాడని లేచిపోయిన వాళ్ళు లేరు. అందుచేత ఈ సంగతెవరికీ సరిగ్గా అర్థంగాదు. సుశీలవంటి సుకుమారితో ఎవరూ జాలిపడరు.

గదిలోకి పోవడమంటే భయం. ఆయన ముఖంచూస్తే రోత. గురకముఖం గురకముఖమే! సదా కోటిజంగాలల్లో జోడిజంగం కనబడక పోవచ్చు. గురకమొఖాన్ని టిబెట్టునుంచి ట్రావెన్కూరు వరకు ఎక్కడైనా గుర్తుపట్టవచ్చు. ఆ ముక్కే వేరు. గురక ముక్కు మాటల్లోగూడా గురు గురు లాడుతూనే వుంటుంది. అందులో గురకానందం ముక్కు ట్రేడ్ మార్కు. ఒక్కొక్క తరహా మనుష్యులకు గురకంటే గిట్టదుగదా, గురక మనుష్యులను చూస్తే మహారోత. సుశీలకు రోత అనేమాట చిన్నమాట. పోనేపోయింది. ఒకరోజు తెగించి పుట్టింటికి లేచిపోయింది. ప్రపంచానికి అర్థమైతే అయింది, కాకపోతే పోయింది! కానీ ఇంక కాపురం చేయటం దుర్ఘటన మనుకున్నది. పుట్టింటమాత్రం ఎన్నాళ్ళు పోరుతారు! తల్లి కేం

చెప్పిందో యేమిటో! తండ్రికి తల్లే చెప్పింది. అంతా ఊరుకున్నారు. ఊరుకోక ఊరేగుతారా, జ్ఞానం తెలిసినపిల్ల శలించి ఇంట్లోకూర్చుంటే!

మూడెన్నెల్ల యింతర్వాత సుశీలకు నవ్వొచ్చింది. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని అన్నారు. నవ్వింది. ఆ మాట అన్నతర్వాతగూడా ఆ పిల్ల మనస్సు మారలేదుగదా!

రెండుసంవత్సరాలైనయ్యి. రెండోపిల్ల కాపురానికిగూడా వచ్చిందని విన్నారు. అదివిని మాత్రం ఇంట్లోవాళ్ళు దుఃఖించారు. సుశీలకు విచారమన్నమాట లేదుగదా!

పాపం నిజానికి సుశీలంటే ఆనందానికి మొదట్నుంచీ ఆపేక్షే. ఏమోలే అనుకొని, తిరిగివస్తే తన అభ్యంతరం ఏమీలేదని కబురు చేశాడు. మొగవాడు పరువు గలవాడు అంతకన్న ఏంజేస్తాడు?

అయితే సుశీలమాత్రం చలించలేదు. ఇంట్లోవాళ్ళెన్ని చెప్పినా ప్రయోజనం లేకపోయింది. ఇంతలో పాపం సుశీలకే జబ్బుగావుండి ఆసుపత్రిలో ఉంచాల్సొచ్చింది. ఆసుపత్రికి వెళ్ళినరోజునే, తన్నుండమన్న గదిలో ఉంకోపిల్ల గూడా వుంటే, ఏదో హాషామాషీ పరిచయం గలిగింది. ఆ సాయంత్రమే పుట్టుపూర్వోత్తరాల దగ్గరనుంచీ కబుర్లు మొదలెట్టారు. "ఆచంటవారి కోడల్ను" అని అనంగానే ఎవరుచెప్మా అనుకొని," మీవారేం చేస్తున్నారు?" అని అడిగింది సుశీల.

"కోర్టులో ఉద్యోగమండీ!"

"అయితే వారే! వారు బాగా గురకపెడతారు గదూ?"

"అమ్మో గురకే! అదేమీలేదండీ. ఎందుకల్లా అడిగారు?"

"నిజంగా గురకపెట్టరూ ఆయన?"

"నిజమేనండీ! ఇదివరకెప్పుడో గురకపెట్టేవారట. మొదటావిడ అందుకనే పుట్టింటికి పోయిందట. ఇప్పుడాయన సరిగ్గానే ఉన్నారండీ!"

"రెండో ఆవిడ అదృష్టంలెండి అదంతా!"

"కానీ మీకోమాట చెబుతాను, మళ్ళీ ఎవరితోనూ అనబోకండేం! నిజానికీ, మొదటావిడ అట్టా చేయకపోతే నా బతుకు తెల్లవారేది కాదూ? ఒకరోజైనా నిద్రపట్టేదీ?"

"ఎవరే ఆపిల్ల ?" అంటూ సుశీల తల్లి వచ్చింది.

"ఆచంటవారి కోడలే. ఆయన రెండోపెళ్ళి పిల్ల!"

"అంటే నీ సవితేనా? నీ పేరేమమ్మా?"

"ఇందుమతండీ! ఈవిడేనా మొదటిభార్య?"

"అవునమ్మా, యేం జేస్తాము? నీ అదృష్టంలే!" అని సుశీల తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఆసుపత్రిలో పదిహేనురోజులున్నా ఆనందం రాలేదు. ఇందుమతి తల్లే వస్తూండేది. రెండు కాపురాలమధ్య మెుభావం జరిగింది. ఇంతలో సుశీల యింటికి పోయింది.

ఆ రోజునుండీ సుశీలకు పరాకు. పైకి బింకం. అదోమాదిరి.

"ఇట్టాగాదుండవే! నువ్వు గురకటం నేర్చుకో. ఇక్కడకూడా చీదరించుకొని మళ్ళీ వెడుతుంది. అతడిదివరకే కబురు చేశాడా మరి. ఏమంటావ్?" అన్నాడు తండ్రి శంకరశాస్త్రుల్లు. తల్లితో.

"మీరు జెప్పింది బాగానేవుందిగాని ఇద్దరంజేస్తే తొందరగానే వెళుతుందిగా?" అన్నది ఆవిడ.

కాస్త కాస్తగా మొదలెట్టారు ఇద్దరూనూ. కానీ కనుక్కుంటే కష్టం గాదూ? రెండుమూడు రోజులైం తర్వాత తల్లితో అన్నది సుశీల—

"ఏమిటే మీ యిద్దరూ అట్టా గురక పెడతారూ! రెండోవాళ్ళకు నిద్రపట్టవద్దూ ?"

"ఏంచెయ్యమే పెద్దవాళ్ళ మవుతున్నామా, ఏదో జరిగిపోతుంది" అన్నది తల్లి.

"ఫర్వాలేదు, తెలిసొస్తున్నది. దగ్గరలోనే ఉంది" అని రహస్యంగా భార్యతో అన్నాడు శంకరశాస్త్రుర్లు.

రోజురోజూ గురకలు హెచ్చుతున్నై. ఆ యింట్లో దొంగలు పడటానికిగూడా వాళ్ళకూ భయమే. పక్క ఇంట్లో వాళ్ళ కుర్రాడు కాలేజీ కుర్రాడు. రాత్రిపూటగాదూ, వాడికిగూడా వినబడేది మేడమీద చదువు కుంటుంటే. పండ్లుకొరికేవాడు, చెమటలు పోసేవి, ఏంజేస్తాడు!

"నాన్నా! ఒకమాట చెపుతాను ఎత్తిపొడవకేం?" అన్నది సుశీల ఒక రోజున.

"ఆదేమిటే! ఏమిటో చెప్పు ఫరవాలేదు" అన్నాడు శంకరశాస్త్రుర్లు.

"మావారిదగ్గరకు పోయీ...."

"పోయీ! ఓహో! సరేలే తల్లీ, అంతకన్నా మాకేంగావాలెనే!

"సాయంత్రమే బయలుదేరి పోతాను."

రాజీమాటలు జరిగినై. మూడురోజుల్లో అంతా కలిసిపోయారు. సుశీల కాపురం చేస్తున్నది మళ్ళా. మహా అనుకూల దాంపత్యం. వేరెవరైనా మాట అనటానికి వీల్లేదు. ఆనందరావుకు మాత్రం గురక ఒకటే అవలక్షణంగాని ఇదివరకు ఏంతక్కువా?

వారంరోజులు తిరగకుండానే శంకరశాస్త్రుర్లు సుశీలను చూడటానికి వచ్చాడు. సుశీలను పిలిచి అన్నాడు—"ఏమిటే మరీ విపరీతం! మీ అమ్మ పెట్టే గురకతో ఇల్లెగిరి పోతున్నదే రోజూనూ!"

"మీరుగూడా గురకతీస్తారు గాదండి?"

"నాదంతా తంతే! అసలు ఇద్దరిదీ తంతే. దానికేమో అతుక్కు-పోయింది. అర్థంగాలేదు టే?"

"అదా! అర్థమైందిలెండి."

మర్నాడు పొద్దున వాకిట్లో పడకకుర్చీ వేసుకుని దీనవదనంతో కూర్చున్నాడు ఆనందం. నీళ్ళివ్వటానికి వచ్చి సుశీల, "అదేమిటీ అల్లా ఉన్నారేం?" అన్నది.

"ఈసారి నేనే లేచిపోతానే, ఇంట్లోనుంచీ!"

"అదేమిటండీ?"

"మీ నాయన తీసేగురక- అది గురకనుకున్నావా? తురక సన్నాయి వెనక వుంటుందే బూర, అది నయం!"

"ఆ, ఆయన యెప్పుడూ ఉంటాడా ఇక్కడ? రెండురోజులు కాస్త ఓపిక పడితేసరి!"

"ఓపికకేమే, నాలుగురోజులూరుకోవచ్చు."

"అయితే లేవండీ?"

"అదిగాదే!"

"ఇంకెందుకూ?"

"మీవాళ్ళు నేర్పితే వచ్చిందేమోగాని, నీవుగూడా కాస్త కాస్త గురక తీస్తున్నావే! పదిరోజుల్నుంచీ ఊరుకున్నాను. ఇవ్వాళ మీ నాయన గురక చూస్తే, ముందు ముందు నీ గురక యే రూపం తాలుస్తుందో!"

●